
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
గురువారం 8 ఫిబ్రవరి 2024



పొత్కపల్లి సహకార సంఘం చైర్మన్‌పై అవిశ్వాసం 8లో..
కార్పొరేషన్ ఆదాయం పెంపుపై దృష్టి పెట్టండి 8లో..

రామగుండంలో కాసుల 'క్వాలిటీ'



రామగుండంలోని రఘుపతిరావునగర్‌లో పగుళ్లు చూపిన సీసీ రోడ్డు



అధికారులు క్యూసీ సర్టిఫికెట్ ఇచ్చిన కంకర తేలిన రోడ్డు

- అభివృద్ధి పనుల్లో నాణ్యతాలోపం
- క్షేత్రస్థాయిలో పరిశీలించని ఇంజనీర్లు
- క్యూసీ సర్టిఫికెట్లు ఇస్తున్న థర్డ్ పార్టీ
- కంకర తేలిన, పగుళ్లు చూపిన రోడ్లకూ..

కోల్‌సిటీ, ఫిబ్రవరి 7: రామగుండంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైపులు పగిలినా.. సీసీరోడ్లు వేసిన పది రోజులకే కంకర తేలినా, రోడ్లు పగుళ్లు చూపినా క్వాలిటీ సర్టిఫికెట్లు మాత్రం 'సూపర్' అని వస్తున్నాయి. కోర్ కంటింగ్‌కు రూ.1500, మెటీరియల్ కలెక్షన్‌కు రూ.2వేలు, క్వాలిటీ సర్టిఫికెట్‌కు ఈసీ వాల్యూపై 0.5శాతం మామూళ్లు రామగుండంలో ఫిక్స్ అయ్యాయి. పని ఏ విధంగా చేసినా సరే క్వాలిటీ సర్టిఫికెట్ వస్తుందనే ధీమాతో కాంట్రాక్టర్లు ఇష్టాను సారంగా పనులు చేస్తున్నారు. అధికారులు పనులు చూడరు, కొందరు కాంటాక్టర్లే ఎంబీ రికార్డులు రాసి ఇంజనీర్లతో సంతకాలు చేయించుకుంటున్నారు. ఒక్కో ఇంజనీర్‌కు రెండుమూడు రకాల హ్యాండ్‌రైటింగ్‌తో ఈ ఎంబీ రికార్డులు ఉంటున్నాయి. ఇక క్యూసీకి షరా మామూలు అనే రీతిలో పరిస్థితులు ఉన్నాయి. సర్టిఫికెట్లు ఉంటే చాలు బిల్లులు ఇస్తామని అకౌంట్స్ విభాగం పేర్కొంటోంది.

రామగుండం నగరపాలక సంస్థలో పట్టణ ప్రగతి, 14, 15వ ఆర్థిక సంఘాలు, డీఎంఎఫ్‌టీ, ఎన్‌టీపీసీ, సింగరేణి సీఎస్ఆర్, సాధారణ నిధులు, ఏసీడీపీ, ఎంపీ ల్యాడ్స్ నిధుతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇంజనీరింగ్ విభాగంలో డివిజన్ల వారీగా ఏఈలు, డీఈలకు బాధ్యతలు ఉన్నాయి. ఏటా సు మారు రూ.50కోట్ల నుంచి రూ.70కోట్ల పనులు జరుగు తుంటాయి. పనుల అంచనాలు మొదలు రికార్డు వరకు ఇంజనీర్లు పర్యవేక్షించాల్సి ఉంటుంది. రామ గుండం నగరపాలక సంస్థలో ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో పనుల పరిశీలన చేయరనేది స్థానికంగా వినిపించే మాట.. ఇంజనీర్లు పర్యవేక్షణ చేయకపోవడంతో పనుల్లో నాణ్యత కొరవడుతోంది. పలు డివిజన్లలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనుల్లో నాసిరకం పైపులు వాడడం, ఇష్టానుసారంగా చాంబర్లు కట్టడం పరిపాటి అయ్యింది. సీసీ రోడ్ల నిర్మాణంతో నాణ్యత పాటించకపోవడంతో వేసిన కొద్ది రోజులకే శిథిలమవుతున్నాయి. చాలా డివిజన్లలో కంకర తేలి గుంతలు పడుతున్నాయి. అయినా బిల్లులు యథాతథంగా చెల్లింపులు జరుగుతున్నాయి.

నాణ్యత లేని పనులకు సర్టిఫికెట్లు..

రామగుండం నగరపాలక సంస్థలో అభివృద్ధి పనుల్లో నాణ్యత పరిశీలన, పరీక్షించడం కోసం థర్డ్‌పార్టీ క్వాలిటీ కంట్రోల్‌ను టెండర్ ప్రాతిపదికన నియమించారు. రెండేళ్ల క్రితం ఒక సంస్థకు పనుల అంచనాలపై 0.9శాతం ఫీజు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. ఈ సంస్థ టెండర్ నిబంధనల ప్రకారం అభివృద్ధి పనుల ప్రారంభించే ముందు పనుల్లో వినియోగిస్తున్న మెటీరియల్‌ను కలెక్షన్ చేయడం, పనులు జరుగుతున్న సమయంలో నాణ్యత పర్యవేక్షించడం, పనులు పూర్తయిన తరువాత కోర్ కటింగ్ చేసి ల్యాబ్‌లో పరీక్ష చేయాల్సి ఉంటుంది. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి సంబంధించి పైపుల నాణ్యతను కూడా పరిశీలించాల్సి ఉంటుంది. కోర్‌కటింగ్ 75క్యూబిక్ మీటర్లకు ఒకటి చొప్పున సేకరించాల్సి ఉంటుంది. వీటి ఆధారంగా క్వాలిటీ సర్టిఫికెట్లు సంబంధిత ఏజెన్సీ జారీ చేయాల్సి ఉంది.

కోర్ కటింగ్, సర్టిఫికెట్లకు సెప'రేటు'..

రామగుండంలో క్యూసీకి సంబంధించి రేట్లు పెట్టి మరీ వసూలు చేస్తున్నట్టు కాంట్రాక్టర్లే ఆరోపిస్తున్నారు. కోర్ కటింగ్‌కు రూ.1500, మెటీరియల్ కలెక్షన్‌కు రూ.2వేలు, సర్టిఫికెట్‌కు అంచనాలపై 0.5శాతం వసూలు చేస్తున్నారని కాంట్రాక్టర్లు పేర్కొంటున్నారు. రూ.10లక్షల పనికి రూ.6వేల నుంచి రూ.8వేలు మామూళ్లే పోతాయని పేర్కొంటున్నారు. క్వాలిటీతో సంబంధం లేకుండా తాము చెల్లించాల్సి వస్తుందంటున్నారు.

రామగుండంలో వివాదాస్పదమైన పగిలిన రోడ్లు, కంకర తేలిన రోడ్లు, శిథిలమైన పైపులు వాడిన యూజీడీ పనులకు క్వాలిటీ సర్టిఫికెట్లు ఇవ్వడం తీవ్ర చర్చనీయాంశం అయ్యింది. కార్పొరేషన్ పరిధిలోని గోదావరిఖని పట్టణంలో గల నాలుగు డివిజన్లలో శిథిలమైన సీసీ రోడ్లకు క్వాలిటీ సర్టిఫికెట్లు ఇవ్వడం, బిల్లుల చెల్లింపులు పూర్తి కావడం కార్పొరేషన్ వర్గాల్లో చర్చనీయాంశం అయ్యింది.

విజిలెన్స్ కోర్ కటింగ్‌లతో ఆందోళన..

రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనులపై విచారణ చేస్తున్న విజిలెన్స్ విభాగం ఇటీవల కోర్ కటింగ్ చేయించింది. విజిలెన్స్ కోర్ కటింగ్ చేయించిన పనులకు ఇప్పటికే క్యూసీ సర్టిఫికెట్లు ఉన్నట్టు తెలుస్తోంది. వీటిల్లో పలు పనులు నాణ్యత లేకుండా ఉండడంతో విజిలెన్స్ అధికారులు కూడా రామగుండం ఇంజనీర్ల పనితీరుపై విస్తుపోయారు. చర్యలకు నివేదికలు కూడా సిద్ధమవుతున్నాయి. రామగుండం ఇంజనీరింగ్‌లో నాణ్యత విషయంలో పట్టింపులేని వైఖరి ఇటు ప్రజలకు ఇబ్బందులు తెచ్చి పెడుతుండగా అధికారులు ఇరుకునపడే పరిస్థితులు నెలకొంటున్నాయి.

పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

- మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి మెరాజ్ మహమూద్



విద్యార్థులతో మాట్లాడుతున్న మెరాజ్ మహమూద్

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 7 : పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి మెరాజ్ మహమూద్ ఉపాధ్యాయులను కోరారు. లంచ్ అండ్ లెర్న్ బుధవారం కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లిలోని మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్‌ను మెరాజ్ మహమూద్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బుధవారం జిల్లా అధికారులు పాఠశాలలను సందర్శించి పిల్లలకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యత, మధ్యాహ్న భోజన వసతులు, విద్యా బోధన, విద్యార్థుల హాజరు పరిశీలించి కలెక్టర్‌కు రిపోర్ట్ చేస్తారని తెలిపారు. స్కూల్‌లో విద్యార్థుల చదువు, హాజరుపై ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మిని అడిగితెలుసుకొన్నారు. పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించి, విద్యార్థులతో కలిసి భోజనంచేశారు. అనంతరం వంటగది, స్టోర్‌రూమ్‌లను తనిఖీ చేసి రిజిస్టర్‌లను పరిశీలించారు. స్కూల్ ఆవరణలో పరిశుభ్రత పాటించాలని, విద్యార్థులకు రుచికరమైన, వేడిగా ఆహారం అందించాలని, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులను కోరారు.

భూములకు మార్కెట్లో ఉన్న ధర కట్టాలి

మంథని, ఫిబ్రవరి 7: మండలంలోని పుట్టపాక గ్రామంలో గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులు తమ భూములకు ప్రవేట్ మార్కెట్లో ఉన్న ధర కట్టించి ఇవ్వాలని భూనిర్వాసితులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నేషనల్ హైవే నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే తమ భూముల నుంచి పోతున్న సందర్భంగా ప్రభుత్వ మార్కెట్‌రేటు తక్కువగా ఉన్నందున ప్రైవేట్ మార్కెట్ రేటు ప్రకారం ఎకరానికి 30 నుంచి 40 లక్షలు ఇప్పించి మమ్మల్ని ఆదుకోగలరని వారు పేర్కొన్నారు. ఇల్లు కోల్పోతున్న వారికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కూడా ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. భూసేకరణ సమావేశంలో గ్రామస్తులు భూములు ఇవ్వడానికి ఒప్పుకోకపోయినా ఒప్పుకున్నట్లు అధికారులు పేర్కొన్నారని, అది అవాస్తవమన్నారు. ఎంపీటీసీ పెగడ శ్రీనివాస్, పుట్టపాక గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బాల్క సుమన్‌పై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 7: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై బుధవారం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భూషణవేణి సురేష్‌గౌడ్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సురేష్‌గౌడ్, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధానకార్యదర్శి సయ్యద్ మస్రత్, బొంకూరి అవినాష్, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బొడ్డుపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బాల్క సుమన్ నాలుక చీరేస్తామన్నారు. లేనిపోని ఆరోపణ చేస్తే తెలంగాణ కాంగ్రెస్ కార్యకర్తలు నిన్ను తెలంగాణలో తిరగనివ్వరని హెచ్చరించారు. చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు భూత గడ్డ సంపత్ తూముల సుభాష్ ఎరుకల కల్పనా రమేష్ పట్టణ ప్రధాన కార్యదర్శి దొడ్డుపల్లి జగదీష్ ఉపాధ్యక్షులు నాంసాని శ్రీనివాస్ మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షులు మసూద్, కాంగ్రెస్ నాయకులు తూముల మహేష్ దేవరకొండ రాజు సురేష్ విజయేందర్ రెడ్డితదితరులు పాల్గొన్నారు.

సీఐల బాధ్యతల స్వీకరణ

కోల్‌సిటీ, ఫిబ్రవరి 7: రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా వీ రవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. 2012 బ్యాచ్‌కు చెందిన రవి పెద్దపల్లి ఇంటలీజెన్స్ సీఐగా పని చేశారు. బదిలీపై వచ్చిన ఇన్‌స్పెక్టర్ రవికి ఎస్ఐ ఉదయ్ కిరణ్, ఏఎస్ఐ వెంకటేష్, సిబ్బంది స్వాగతం పలికారు.

మంథని, ఫిబ్రవరి 7: మంథని సీఐగా రాజుగౌడ్ తన కార్యాలయంలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీపై మంథని సీఐగా వచ్చిన రాజుగౌడ్‌కు ఎస్ఐలు కిరణ్‌కుమార్, రాణివర్మ స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సీఐ వారితో స్టేషన్, శాంతిభద్రతలపై ఆరా తీశారు.

అమృత్ భారత్ స్టేషన్ పనుల పరిశీలన



రైల్వేస్టేషన్‌లో పనులను పరిశీలిస్తున్న కందుల సంధ్యారాణి, నాయకులు

అంతర్గాం, ఫిబ్రవరి 7: అమృత్ భారత్ రైల్వే స్టేషన్ కార్యక్రమంలో భాగంగా రూ.26కోట్ల నిధులతో రామగుండం రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పనులను బుధవారం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి, పాలకుర్తి జెడ్‌పీటీసీ కందుల సంధ్యారాణిపోచం పరిశీలించారు. ఈ సందర్భంగా రైల్వే ఏడీఈఎన్ మనోజ్‌కుమార్ గుప్తాతో పనుల పురోగతిపై సమీక్షించి ఈమేరకు మాట్లాడారు. నిర్ణీత గడువులోగా అభివృద్ధి పనులను పూర్తిచేసి ప్రయాణిలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైల్వే బోర్డు మెంబర్ క్యాతం వెంకటరమణ, నాయకులు తోట కుమారస్వామి, బరుపటి నారాయణ, బొల్లారం రామకృష్ణ, చిలువేని కుమార్ పాల్గొన్నారు.

రమాబాయిఅంబేద్కర్‌కు ఘన నివాళి

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 7: త్యాగశీలి రమాబాయి అంబేద్కర్ అని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. రమాబాయి జయంతి సందర్భంగా మున్సిపల్ టీ జంక్షన్ వద్ద అంబేద్కర్ భవన్‌లో బుధవారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ అనీల్ కుమార్, మైస రాజేష్, బొంకూరి మధు, లంక సదయ్య, కొంకటి లక్ష్మణ్, కాంపెల్లి సతీష్, మంథని లింగయ్య, రాజేశం, చంద్రమౌళి, మహేందర్, రాజనర్సు, రవీందర్ పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై ఎమ్మెల్యే సమీక్ష



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 7: పట్టణంలో తాగునీటి సరఫరాపై ఎమ్మెల్యే విజయ రమణారావు మున్సిపల్, మిషన్ భగీరథ అధికారులతో బుధవారం ఆర్‌అండ్ బీ గెస్ట్‌హౌస్‌లో సమీక్ష నిర్వహించారు. రానున్న వేసవి కాలంలో పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పైపులైన్ల లీకేజీలు లేకుండా చూడాలని అవసరమైతే కొత్త లైన్ వేయాలన్నారు. పట్టణంలో కొన్ని ప్రాంతాల్లో నల్లాలు లేవని వాటిని గుర్తించి అందరికి తాగునీరందించాలని ఆయన పేర్కొన్నారు. అలాగే వ్యవసాయ మార్కెట్లో నిర్మిస్తున్న ట్యాంకుల పూర్తి పనులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, మిషన్ భగీరథ అధికారులు, నాయకులు మినుపాల ప్రకాష్ రావు, నూగిళ్ళ మల్లయ్య, ఉప్పు రాజు తదితరులున్నారు.

దివ్యాంగులకు ఎలాక్ట్రానిక్ సైకిళ్ళు పంపిణి చేసిన ఎమ్మెల్యే

తెలంగాణ వికలాంగుల కో ఆపరేటివ్ కార్పొరేషన్ హైదరాబాద్ సహకారంతో నియోజకవర్గం లోని పదిమంది దివ్యాంగులకు బుధవారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఎలక్ట్రానిక్ సైకిల్స్ అందజేశారు. అనంతరం నియోజకవర్గంలోని ఐదుగురిని మినీ అంగన్‌వాడీ టీచర్లకు పదోన్నతి పత్రాలు అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాలు లేవని దృష్టికి తీసుకురాగా, అంగన్‌వాడీ కేంద్రాలు లేనిచోట ఏర్పా టు చేసేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్ రౌఫ్ ఖాన్ కవిత, స్వర్ణలత జడీటీసీ బండారి రామ్మూర్తి, తదితరులున్నారు.

ఎస్సీ కార్పొరేషన్ పెండింగ్ రుణాలు మంజూరు చేయాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 7: దళితుల ఎదుర్కుంటున్న సమస్యలపై జిల్లా దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ఒక్క రోజు దీక్ష చేపట్టారు. మద్దతు తెలిపిన సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం మాట్లాడుతూ అన్ని రంగాల్లో దళితులు వెనకపడ్డరని, దళితులపై వివక్ష కొనసాగుతుందని సంక్షేమ పథకాల్లో అర్హులైన దళితులకు న్యాయం జరగడం లేదన్నారు. 2018 నుంచి నేటి వరకు ఎస్సీ కార్పొరేషన్ నిధులు విడుదల కాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ చూపి ఎస్సీ కార్పొరేషన్ నిధులు విడుదల చేయాలని, అలాగే దళితబంధు పథకం కూడా కొనసాగించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న నిధులు విడుదల చేయాలని, అదే విధంగా కులాంతర వివాహాలు చేసుకున్న ఎస్సీలకు 10 లక్షలు రూపాయలు ప్రోత్సాహం అందించాలని, దళితులపై దాడులు అరికట్టే విధంగా నూతన చట్టాలు తీసుకురావాలన్నారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజా రత్నం, ఏఐటీయూసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కడారి సునీల్ మాట్లాడుతూ అర్హులైన దళితులకు మూడు ఎకరాల భూమి కేటాయించాలని, డబుల్ బెడ్రూంలో ఇవ్వాలని, ఇంటి నిర్మాణ పనులకు ఉచితంగా రుణాలు అందించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు పెర్క సతీష్, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు జిల్లా కొడేం స్వామి, అనల రామ, శనిగారపు తిరుమల బుద్దుల రమేష్, ఎర్రల రాజయ్య, బండారి సదానందం, మాతంగి వెంకటేష్, క్రాంతి లేనిన్, శ్రీనివాస్, క్రాంతి, అరిపెల్లి మనస్ కుమార్, చంద్రగిరి ఉదయ్, తదితరులు పాల్గొన్నారు

సాధారణ ప్రసవాలు పెరిగేలా చూడాలి

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ - ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ - రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా



ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 7: ప్రభుత్వ ఆసుపత్రిలో మొదటికాన్పు సాధారణ ప్రసవాలు పెరిగే దిశగా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని, సాధారణ ప్రస వం వల్ల కలిగే లాభాలను గర్భిణులకు వివరించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ వైద్యాధికారులకు సూచించారు. బుధవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాతా శిశు ఆసు పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వివిధ వార్డులను పరిశీలించిన కలెక్టర్ రోగులకు అందుతున్న సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ మొదటి కాన్పు సాధారణ ప్రసవం అయ్యేలా అవసరమైన వ్యాయామాలు గర్భిణులతో చేయించాలని, సాధారణ ప్రసవంవల్ల కలిగే లాభాలను వారికి విస్తృతంగా వివరించి, సిజేరియన్ ఆపరేషన్లు తగ్గించేలా చూడాలన్నా రు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాకాంత్, వైద్యాధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహనదారులకు హెల్మెట్ అందజేస్తున్న సీఐ, ఆర్ఎఫ్‌సీఎల్ అధికారులు



డ్రైవర్లతో రోడ్ సేఫ్టీ ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్ఐ, ఎంవీఐ

కోల్‌సిటీ, ఫిబ్రవరి 7: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్‌సీఐ వీ రవి వాహనదారులకు పిలుపునిచ్చారు. రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా ఆర్ఎఫ్‌సీఎల్ ఆధ్వర్యంలో గోదావరిఖని బంగ్లాస్ ఏరియా వద్ద బుధవారం హెల్మెట్ ధరించని ద్విచక్రవాహనదారులకు హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి ద్విచక్ర వాహనం ఉందని, రోజువారి కార్యకలాపాల కోసం ద్విచక్ర వాహనాలు ఉపయోగిస్తున్నారని, కానీ హెల్మెట్ ధరించకపోవడంతో ప్రమాదం జరిగిన సమయంలో ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందన్నారు. ప్రతిఒక్కరూ వాహనాలపై వెళ్లే వారు తప్పకుండా హెల్మెట్ ధరించాలని చెప్పారు. ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేసిన ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యానికి సీఐ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎఫ్‌సీఎల్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ అధికారి ప్రదీప్, ఎస్ఐ ఉదయ్ కిరణ్, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్, అశోక్ పాల్గొన్నారు.

జ్యోతినగర్, ఫిబ్రవరి 7 : డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలకు తావుండదని ఎన్టీపీసీ ఎస్ఐ జీవన్ అన్నారు. బుధవారం ఎన్టీపీసీలోని ఎంవీఐ కార్యాలయంలో రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా స్కూల్ బస్‌డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిధిగా హాజరైన ఎస్ఐ జీవన్ ప్రసంగిస్తూ ప్రతి డ్రైవరుకు ట్రాఫిక్ నియమ, నిబంధనలు, రహదారి భద్రత విషయంలో సంపూర్ణమైన అవగాహన ఉండాలన్నారు. వాహనాలు నడిపే సమయంలో ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రామగుండం ఎంవీఐ భీం సింగ్ ప్రసంగిస్తూ డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడప వద్దని, స్కూల్ బస్సుకు కచ్చితలంగా ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రం ఉండాలని, ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉదయ్‌కిరణ్ సీపీఆర్ చేసే విధానాన్ని చూపించారు. డ్రైవర్లకు సేఫ్టీ బ్యాండ్లను పంపిణీ చేశారు. అలాగే డ్రైవర్లచే రోడ్ సేఫ్టీ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీపీసీ ఎస్ఐ(2) చక్రపాణి, రవాణా శాఖ సిబ్బంది, డ్రైవర్లు పాల్గొన్నారు.

ధర్మారం, ఫిబ్రవరి 7: రహదారులపై అతివేగంగా వాహనాలను నడపి ప్రమాదాలకు గురి కావద్దని ధర్మారం ఎస్సై సత్యనారాయణ సూచించారు. బుధవారం ధర్మారంలో జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వాహనాదారులతో ర్యాలీ నిర్వహించారు. ఎస్సై సత్యనారాయణ మాట్లాడుతూ..రోడ్డుపై వాహనాలను నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలన్నారు. ఈ ర్యాలీలో పోలీస్ సిబ్బంది, వాహనాదారులు పాల్గొన్నారు.

పాలకుర్తి, ఫిబ్రవరి 7: మండలం పరిధిలోని బసంత్‌నగర్ టోల్ ప్లాజా వద్ద బుధవారం పెద్దపల్లి ఆర్టీవో అఫ్రిన్ సిద్దిక్ స్థానికులు, వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా రహదారి వినియోగదారులకు పుష్పాలను, భద్రతా కంకణాలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో అల్లె శ్రీనివాస్, బీమ్‌సింగ్, ఎంవీఐలు మధు, టోల్ ప్లాజా అధికారులు రామకృష్ణ, కన్నబాబు, రాము, రాజు ఉన్నారు.

పెద్దపల్లి ఎంపీ టికెట్ మాదిగలకు కేటాయించాలి

మాదిగల చైతన్య ఐక్య వేదిక కన్వీనర్ పాపయ్య

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 7: పెద్దపల్లి పార్లమెంట్ టికెట్ మాదిగలకు కేటాయించకపోతే చావుడప్పు మోగిస్తామని మాదిగల చైతన్య ఐక్య వేదిక కన్వీనర్ కోటగిరి పాపయ్య హెచ్చరించారు. బుధవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 75సంవత్సరాలుగా పెద్దపల్లి ఎంపీ టికెట్ మాలలకు, నేతకానిలకు కేటాయిస్తున్నారని, మాదిగ సామాజికవర్గానికి కేటాయించకపోవడం అన్యాయమన్నారు. ఈ సారి మాదిగలకే కేటాయించాలని అన్ని రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. ఈనెల 14న హైదరాబాద్‌లో అన్నీ రాజకీయ పార్టీలను కలిసి మాదిగకే టికెట్ కేటాయించాలని కోరుతామని పేర్కొన్నారు. ఈసారి కూడా మాదిగకు టికెట్ ఇవ్వకపోతే అన్నీ రాజకీయ పార్టీల కార్యాలయాల ముందు వెయ్యి డప్పులతో చావు డప్పులు మోగిస్తామని హెచ్చరించారు. ఈ నెల 10వేల మందితో జిల్లా కేంద్రంలో మాదిగల సభ ఏర్పాటు చేయనున్నట్టు, దీనికి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన మాదిగలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో నాయకులు పల్లె సదానందం, ఇరికిళ్ల కనకయ్య, లక్ష్మయ్య, ప్రభాకర్, శ్రీనివాస్, కన్నూరి ధర్మేందర్, రొడ్డ సంపత్, కండె కుమారస్వామి, పులిపాక శ్రీహరి పాల్గొన్నారు.

ఇళ్ల పేరుతో పేదలకు కుచ్చుటోపీ

● రూ.కోటిన్నరకు పైగా వసూలు ● ఏడుగురిపై కేసు.. ఇద్దరి అరెస్టు

ముస్తాబాద్, ఫిబ్రవరి 7: పేదలకు ఇళ్లు కట్టిస్తామన్న ఓ స్వచ్ఛంద సంస్థ వారికి కుచ్చుటోపి పెట్టింది. ముస్తాబాద్ మండలం మోయినికుంట, మద్దికుంట, మొర్రాయిపల్లె గ్రామాల్లో సిటిజన్స్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ అనే స్వచ్ఛంద సంస్థ డబల్ బెడ్‌రూం ఇళ్లు కట్టిస్తామని వసూళ్లకు పాల్పడింది. ఐదేళ్ల క్రితం మూడు గ్రామాల్లో స్వచ్ఛంద సంస్థ తరఫున ఇళ్లు కట్టించేందుకు లబ్ధిదారుడు వాటా చెల్లించాలని పేర్కొంది. దీంతో మూడు గ్రామాల్లోని పేదలు రూ.లక్ష నుంచి రెండు లక్షల వరకు అప్పు చేసి ప్రతినిధుల చేతిలో పెట్టారు. గ్రామాల్లో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పేదల నుంచి డబ్బులు తీసుకొని ఒప్పందం చేసుకున్నారు. 2020సంవత్సరంలో జరిగిన ఒప్పందంలో లబ్ధిదారుడి వాటా రూ.3.50 లక్షలు చెల్లించాలని, మరో ఆరున్నర లక్షలు సంస్థ ద్వారా చెల్లించేందుకు అంగీకరించారు. కొంత మంది లబ్ధిదారులకు సంస్థ రాయి, సిమెంట్ స్టీలు పంపించి బెస్‌మెంట్ వరకు పనులు చేపట్టారు. రోజులు గడుస్తున్న పనులు పూర్తి కాకపోవడంతో సంస్థ ప్రతినిధులను సంప్రదించగా స్పందించలేదు.

మూడు గ్రామాల్లో దాదాపు వంద మందికి పైగా లబ్ధిదారులు రూ. కోటిన్నర చెల్లించినట్లు భావిస్తున్నారు. మద్దికుంట, మొర్రాయిపల్లె, మోయినకుంట గ్రామాల్లో కొంతమందికి చెల్లిం చిన డబ్బుల మట్టుకు ఇంటి నిర్మాణ ముడి సరుకు అందినట్లు తెలిపారు.

ఠాణాను ఆశ్రయించిన బాధితులు

డబ్బులు చెల్లించలచినా పనులు మొదలు పెట్టకపోవడంతో ఆందోళన చెందిన లబ్ధిదారులు కొంత మంది పోలీసులను ఆశ్రయించారు. 2022లోనే మోయినికుంట, మద్దికుంట, మొర్రాయిపల్లెకు చెందిన బాధితులు ముస్తాబాద్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు సంస్థ ప్రతినిధులు కె వేణుగోపాల్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భూపతిరెడ్డి, మరో నలుగురిపై సోమవారం కేసు నమోదు చేశారు. అదేరోజు శ్రీనివాస్‌రెడ్డి, భూపతిరాజును రిమాండ్‌కు తరలించారు. మూడు గ్రామాల్లో ఇళ్లు నిర్మిస్తామని స్వచ్ఛంద సంస్థ పేదల వద్ద భారీ వసూళ్లకు పాల్పడి మోఖం చాటేయడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

టిప్పర్‌ను ఢీకొన్న కారు

● ఇద్దరి మృతి..

ఒకరి పరిస్థితి విషమం

శంకరపట్నం, ఫిబ్రవరి 7: శంకరపట్నం మండలంలోని కొత్తగట్టు గ్రామంలో కరీంనగర్-వరంగల్ హైవేపై బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. కరీంనగర్ నుంచి హనుమకొండ వైపు వెళ్తున్న కారు కొత్తగట్టు శ్రీమత్స్యగిరీంద్రస్వామి ఆలయ సమీపంలో అదుపు తప్పి రోడ్డు పక్కన నిలిపి ఉన్న టిప్పర్‌ను ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న హనుమకొండకు చెందిన తాళ్లపల్లి కొంరమ్మ(68), కరీంనగర్‌కు చెందిన నీర్ల ప్రభాకర్ (58)లు అక్కడికక్కడే మృతి చెందారు. తాళ్లపల్లి సదానందం, తాళ్లపల్లి గీతలకు తీవ్ర గాయాలయ్యాయి. గీత పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. మృతుడు ప్రభాకర్ భార్య సబిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి తెలిపారు. ఆగి ఉన్న టిప్పర్‌కు పార్కింగ్ లైట్లు వేయక పోవడంతోనే ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

రూ.6,650 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఫిబ్రవరి 7: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6,650 పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు 82మంది రైతులు 758క్వింటాళ్లు విడి పత్తి, 13మంది రైతులు 19క్వింటాళ్లు గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.6,650, కనిష్ఠ ధర రూ.5,500 చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

చోరీ కేసులో ఇద్దరికి జైలు

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 7:దొంగతనం కేసులో నేరం రుజువు కావడంతో ఇద్దరికి ఎనిమిది నెలల కఠిన కారాగార శిక్ష విధిస్తూ పెద్దపల్లి జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారని బసంత్‌నగర్ ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గత ఏడాది సెప్టెంబర్ ఒకటిన పెద్దపల్లి మండలంలోని రాఘవపూర్ శివారులో గల హన్‌మాన్ దేవాలయంలో హుండీ పగలకొట్టి అందులో గల ఇరవై వేల రూపాయల నగదు దొంగిలించారు. దర్యాప్తులో హన్మకొండకు చెందిన పాశం ప్రణీత్, ఉమర్ ఫరూక్ చోరీకి పాల్పడినట్లు తేలింది. అప్పటి ఎస్‌ఐ గంగరాజు గౌడ్ కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టు విచారణలో నేరం రుజువు కావడంతో నిందితులకు ఎనిమిది నెలల కఠిన కారాగార శిక్ష విధించారు. కేసును ప్రస్తుత బసంత్‌నగర్ ఎస్‌ఐ వెంకటేశ్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాకేష్ ఆధ్వర్యంలో కోర్టు పీసీ సంజయ్ కేసును ట్రయల్ నడిపించారు.

ఆచంపల్లి గ్రానైట్ ఫ్యాక్టరీలో చోరీకి యత్నం

గంగాధర, ఫిబ్రవరి 7: గ్రానైట్ ఫాక్టరీలో బుధవారం వేకువ జామున ఆరుగురు గుర్తు తెలియని మహిళలు చోరీకి యత్నించారు. గంగాధర మండలం ఆచంపల్లిలోని గ్రానైట్ కటింగ్ ఫ్యాక్టరీలో వేకువ జామున సిబ్బంది నిద్రిస్తున్న సమయంలో కొందరు మహిళలు చోరీకి ప్రయత్నించారు. గ్రానైట్ కటింగ్ మిషన్‌కు నీటిని సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన 10 హెచ్‌పీ మోటర్ల విద్యుత్ తీగలను కత్తిరించారు. ఇదే సమయంలో శబ్దం రావడంతో ఫ్యాక్టరీ సిబ్బంది కేకలు వేశారు. సుమారు ఆరుగురు మహిళలు ఆటోలో పారిపోతుండగా ఫ్యాక్టరీ సిబ్బంది ద్విచక్రవాహనాలపై వెంబడించి కొత్తపల్లి మండలం నాగుల మల్యాల వద్ద వారిని పట్టుకున్నారు. మహిళలు మానకొండూరు మండలానికి చెందిన వారిగా తెలిసింది. సిబ్బంది అప్రమత్తతతో గ్రానైట్ ఫ్యాక్టరీ పెద్ద మోటర్లను కాపాడగలిగారు. దీనిపై ఎస్‌ఐ అభిలాష్‌ను వివరణ కోరగా ఇప్పటి వరకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

డబ్బులు ఇవ్వాలని బెదిరించిన వ్యక్తి రిమాండ్

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 7: సిరిసిల్ల పట్టణం చంద్రంపేటకు చెందిన రమణారెడ్డిని రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ ఉదయ్‌రెడ్డి బుధవారం తెలిపారు. రమణారెడ్డి భూ తగాదాల్లో మధ్యవర్తిత్వం చేస్తూ డబ్బులు, భూమి డిమాండ్ చేసేవాడని పేర్కొన్నారు. చంద్రంపేటకు చెందిన రాజు అనే వ్యక్తిపై హత్యాప్రయత్నం చేసిన సంఘటనతో పాటు అతడిపై మరో నాలుగు కేసులు నమోదయ్యాయని తెలిపారు. దర్యాప్తులో భాగంగా రమణారెడ్డి కోసం గాలిస్తుండగా కోర్టులో లొంగిపోయాడని, మెజిస్ట్రేట్ రిమాండ్‌కు తరలించారని పేర్కొన్నారు. తన భూ సమస్య పరిష్కారానికి రమణారెడ్డిని సంప్రదించగా సెటిల్‌మెంట్ చేస్తానని చెప్పి రూ.3లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేయగా రూ.1లక్ష అడ్వాన్సుగా తీసుకొని భూసమస్య పరిష్కారం చేయలేదని, అయినప్పటికీ మిగితా రూ. 2లక్షలు ఇవ్వాలని ఒత్తిడిచేశాడని లేదంటే 100గజాల స్థలం రిజిస్ట్రేషన్ చేయాలని బెదిరించడమే కాకుండా ఈ నెల 5న వేములవాడకు వెలుతుండగా తనపై హత్యాప్రయత్నం చేశాడని బాధితుడు చంద్రంపేటకు చెందిన తుంగ రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

రాయికల్, ఫిబ్రవరి 7: రాయికల్ పట్టణానికి చెందిన దాసరి చిన్న నర్సయ్య (70) జ్ఞాపకశక్తి కోల్పోయి ఈ నెల 4న ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. బుధవారం మధ్యాహ్నం చిన్ననర్సయ్య మృతదేహం రాయికల్ గ్రామ శివారులోని జన్నయి చెరువులో లభ్యమైంది. చిన్న నర్సయ్య మతిస్థిమితం సరిగా లేక ప్రమాదవశాత్తు నీటిలో పడి చనిపోయాడని అతని భార్య దాసరి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై అజయ్ తెలిపారు.

రాజన్న వసతి గదుల బుకింగ్ కంప్యూటరీకరణ

వేములవాడ, ఫిబ్రవరి 7: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం వసతి గదులను ఆలయ అధికారులు కంప్యూటరీకరించారు. ఇప్పటి వరకు ఆలయ వసతి గదుల కేటాయింపును ఉద్యోగులు మ్యానువల్‌గా చేసేవారు. ఇకపై కంప్యూటర్ ద్వారా వసతి గదులను కేటాయించడానికి అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. వసతి గదుల కేటాయింపు విషయంలో ఆలయ ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్న తరుణంలో రాష్ట్రంలోని ఇతర ఆలయాల తరహాలో వసతి గదుల కేటాయింపును కంప్యూటర్ ద్వారా చేసేందుకు నిర్ణయించడంతో సామాన్య భక్తులకు సైతం గదులు సులభంగా లభించే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. వసతి గది కోసం వచ్చే యాత్రికుడు తప్పనిసరిగా విచారణ కార్యాలయానికి వచ్చి ఫొటో గుర్తింపు కార్డుతో పాటు స్వామి వారి అద్దె గదిలో ఉండే వారి వివరాలను వెల్లడిస్తే కంప్యూటర్‌లో నమోదు చేసి గది అద్దె మొత్తం, అడ్వాన్సు చెల్లించిన తర్వాత గది కేటాయిస్తారు. 24 గంటల్లో వసతి గది ఖాళీ చేయని యాత్రికుడికి సంబంధించి అడ్వాన్స్ మొత్తాన్ని తదుపరి అద్దె కింద జప్తు చేస్తారు. వసతి గదుల కంప్యూటరీకరణ ద్వారా ఆలయంలోని ఏఏ వసతి సముదాయంలో ఎన్ని గదులు ఖాళీ ఉన్నాయని వాటిపైన సైతం సంబంధిత సిబ్బందికి స్పష్టమైన అవగాహన ఏర్పడుతుంది. ఇదిలా ఉండగా భీమేశ్వర సదన్, పార్వతిపురం వసతి సముదాయాలకు అదనపు కౌంటర్‌ను ఏర్పాటు చేయడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామని ఆలయ అధికారులు తెలిపారు. టి యాప్ ద్వారా ముందస్తు బుకింగ్ సౌకర్యం.. రాజన్న సన్నిధికి వచ్చే భక్తులు వసతి గదులను ముందస్తుగా ఆన్‌లైన్ ద్వారా రిజర్వ్ చేసుకునేందుకు టి యాప్ పోలియో యాప్, మీసేవ పోర్టల్ అవకాశం కల్పించారు. వసతి గదుల బుకింగ్‌తో పాటు శ్రీస్వామి వారి ఆర్జిత సేవలకు సంబంధించిన పూజల టికెట్లను ముందస్తుగా బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించారు. ఆన్‌లైన్ ద్వారా రాజన్న ఆలయ వసతి గది బుక్ చేసుకోవాలనుకునేవారు కనీసం వారం రోజులు ముందుగా బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో ప్రస్తుతం నందీశ్వర వసతి గదుల సముదాయంలో 112 నాన్ ఏసీ గదులు, 55 ఏసీ గదులు, 8 సూట్లు ఉండగా, లక్ష్మీగణపతి కాంప్లెక్స్‌లో 98 నాన్ ఏసీ గదులు, పార్వతీపురంలో 110 నాన్ ఎసి గదులు, భీమేశ్వర సదన్ 56 ఏసీ గదులు, 4 సూట్లు, 4 గెస్ట్ హౌస్‌లు, అమ్మవారి కాంప్లెక్స్‌లో 4 ఏసీ గదులు అందుబాటులో ఉన్నాయి.



వేములవాడలో వసతి గదుల విచారణ కార్యాలయం

రాజన్న హుండీ ఆదాయం రెండు కోట్ల 15 లక్షలు

వేములవాడ, ఫిబ్రవరి 7: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం ఖజానాకు హుండీ ద్వారా రెండు కోట్ల పదిహేను లక్షలకు పైచిలుకు ఆదాయం సమకూరింది. గత 14 రోజుల వ్యవధిలో భక్తులు శ్రీ స్వామివారి హుండీలలో సమర్పించిన కానుకలను ఆలయ ఓపెన్ స్లాబ్ ప్రాంగణంలో బుధవారం లెక్కించారు. ఈ సందర్భంగా 2 కోట్ల 15 లక్షల 67 వేల 130 రూపాయల నగదు, 71 గ్రాముల 500 మిల్లీ గ్రాముల బంగారం, 13 కిలోల 600 గ్రాముల వెండి లభించినట్లు ఆలయ ఈవో డి కృష్ణ ప్రసాద్ తెలిపారు.

వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయానికి స్థలం కేటాయించాలి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 7: కరీంనగర్‌లో వాణిజ్య పన్నులశాఖ కార్యాలయ భవన నిర్మాణానికి 20 గుంటల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని అధికారులు, ఉద్యోగులు కోరారు. బుధవారం ఉమ్మడి జిల్లా వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ సిహెచ్.రవికుమార్, తెలంగాణ వాణిజ్య పన్నులశాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండి. ముజాహిద్‌హుస్సేన్, కరీంనగర్ డివిజన్ అధ్యక్షుడు గుంటి భిక్షపతి ఆధ్వర్యంలో కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి వినతిపత్రం సమర్పించారు.

కోతుల దాడిలో వృద్ధుడికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 7: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలో బుధవారం కోతులు దాడిలో అదే గ్రామానికి చెందిన వృద్ధుడు అలివేలి నారాయణ తీవ్ర గాయాలపాలయ్యాడు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. నారాయణ తన ఇంటి నుంచి బస్టాండు వద్దకు నడుచుకుంటూ వెళ్తుండగా నాలుగు వానరాలు మూకుమ్మడిగా దాడి చేసి గాయపరిచాయి. పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు తెలిపారు. కాగా గ్రామంలో కోతుల బెడద అధికంగా ఉందని అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఇళ్లలోకి చొరబడి బీభత్సం సృష్టిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి గ్రామంలో కోతుల బెడదను నివారించాలని కోరుతున్నారు.

మేడారం జాతర ఏర్పాట్లు పరిశీలించిన ఆర్ఎం

భగత్‌నగర్, ఫిబ్రవరి 7: సమ్మక్క సారలమ్మ మేడారం జాతరకు కరీంనగర్ బస్టాండ్‌లో బస్సుల పాయింట్ల ఏర్పాట్లను బుధవారం ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ఎస్ సుచరిత పరిశీలించారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత ప్రయాణానికి అవకాశం ఉన్నందున మేడారం జాతరకు భక్తులతాకిడి ఎక్కువగా ఉంటుందన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగు నీరు, ఇతర మౌళిక వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. కరీంనగర్-1, 2డిపోల్లో ఇతర డిపోల నుంచి వచ్చే ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన వసతి సౌకర్యాలను పరిశీలించారు. ప్రయాణికులకు చల్లని నీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని బస్‌స్టేషన్ మేనేజర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ వెంకటేశ్వర్‌రావు, డిప్యూటీ రీజినల్ మేనేర్ (ఆపరేషన్స్) ఎస్ భూపతిరెడ్డి, డిప్యూటీ ఆర్ఎం మెకానికల్ కె సత్యనారాయణ, డిపో మేనేజర్లు ఎల్‌మల్లేశం, విమలయ్య, రజనీకృష్ణ, వీరస్వామి, నజీర్ ఉన్నారు.


బస్టాండ్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్టీసీ ఆర్ఎం సుచరిత

వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 7: సిరిసిల్ల పట్టణంలోని సిద్దార్థనగర్‌లో రాగుల స్రవంతి అలియాస్ లాస్య(30) అనే వివాహిత అదనపు వరకట్న వేధింపులకు బలైంది. భర్త, అత్తలు అదనంగా రూ.10 లక్షలు వరకట్నం ఇవ్వాలని గత కొంతకాలంగా వేధిస్తుండటంతో ఆత్మహత్యకు పాల్పడింది. సిరిసిల్ల టౌన్ సీఐ రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. సిద్ధిపేట జిల్లా అక్కన్నపేట మండలం కేశవాపూర్ గ్రామానికి చెందిన స్రవంతిని ఇల్లందకుంట మండల కేంద్రానికి చెందిన రాగుల నాగరాజుతో ఆరు సంవత్సరాల క్రితం వివాహమైంది. వివాహ సమయంలో రూ.20 లక్షల వరకట్నం, ఇతర లాంచనాలు ఇచ్చారు. వీరికి అయిదేళ్ల కూతురు, రెండేళ్ల బాబు ఉన్నారు. స్రవంతి బీటెక్ పూర్తిచేయగా భర్త నాగరాజు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సర్దాపూర్ 17బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. వీరు సిద్దార్థనగర్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. మంగళవారం ఉదయం స్రవంతి వాంతులు చేసుకోవడంతో అనుమానం వచ్చిన భర్త స్థానిక ఆస్పత్రికి చికిత్స కోసం తరలించాడు. పరిస్థితి విషమించడంతో చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించగా అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించగా రాత్రి మృతిచెందింది. భర్త నాగరాజు అదనంగా రూ. 10లక్షల వరకట్నం తీసుకురావాలని వేధించడంతో పాటు బాబు పుట్టేంత వరకు అబార్షన్ చేయించాడని, తల్లిదండ్రుల మాటలు వింటూ భార్యను హింసించేవాడని దీనితోనే తన కూతురు ఆత్మహత్య చేసుకుందని తల్లి లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్రవంతి పురుగుల మందు తాగి ఉంటుందని పోలీసులు భావి స్తున్నారు. ఈ సంఘటనపై అనుమానాస్పద కేసుగా నమోదు చేసి మృతదేహానికి పంచనామా అనంతరం పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సిఐ రఘుపతి తెలిపారు. కాగా తల్లి మృతితో ఇద్దరు చిన్నారులు విలపించడం విషాదం నింపింది.


స్రవంతి (ఫైల్)

భర్తపై కేసు నమోదు

స్రవంతి మృతి కేసులో కానిస్టేబుల్ అయిన భర్త నాగరాజు, అతని తల్లిపై 304బి సెక్షన్ కింద కేసు నమోదు చేశామని టౌన్ సిఐ రఘుపతి తెలిపారు. ఈ కేసులో నాగరాజును అరెస్ట్ చేశామని గురువారం రిమాండ్‌కు తరలిస్తామని తెలిపారు.

బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో దొంగల చేతివాటం

● జేబులు కట్ చేసి నగదు, ఫోన్లు అపహరణ

ధర్మపురి, ఫిబ్రవరి 7: ధర్మపురి పట్టణంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరైన కొందరు నాయకుల జేబులు కట్ చేసి నగదు, మొబైల్ ఫోన్లను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం అపహరించారు. సమావేశం ముగిసిన తరువాత కార్యకర్తలు భోజనం చేసేందుకు వెళ్లే సమయంలో ఫంక్షన్ హాల్ రద్దీగా మారింది. ఆ సమయంలోనే జేబులు కత్తిరించి పర్సులు, మొబైల్ ఫోన్లు అపహరించారు. పాక వెంకటేషం వద్ద నుంచి రూ.12,000, కోఆప్షన్ మెంబర్ ఎండీ అలీ మొబైల్ ఫోన్, బొల్లె భగత్ కుమార్ వద్ద రూ.4,000, రాచకొండ ఆనంద్ వద్ద రూ 5,500, కాశెట్టి వీరేశం నుంచి రూ. 18,000, మరి కొందరు వ్యక్తుల నగదు, మొబైల్ ఫోన్లు అపహరించారు. ఫంక్షన్ హాల్ సీసీ కెమెరాల ఆధారంగా చోరీలకు పాల్పడ్డ వ్యక్తులను పట్టుకోవాలని కోరుతున్నారు.

మాజీ నక్సలైట్‌పై పీడీ యాక్ట్

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 7: వేములవాడ పట్టణం తిప్పాపూర్‌కు చెందిన మాజీ నక్సలైట్ మానుక కుంటయ్య(45)పై జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్‌ల ఆదేశాల మేరకు పీడీయాక్ట్ అమలు చేస్తూ ఆ ఉత్తర్వులను అందజేసి బుధవారం చర్లపల్లి జైలుకు తరలించినట్లు టౌన్ సిఐ కరుణాకర్ తెలిపారు. తిప్పాపూర్‌కు చెందిన కుంటయ్య గతంలో జనశక్తి అనే తీవ్రవాద గ్రూపులో పనిచేసి ఆ తర్వాత లొంగిపోయి భూ సమస్యలపై జోక్యం చేసుకుంటూ యజమానులను బెదిరిస్తూ వారి నుంచి డబ్బు వసూలు చేసేవాడని తెలిపారు. మానుక కుంటయ్య నేర కార్యకలాపాలను నిరోధించడానికి జిల్లా పరిధిలో భూ సంబంధించిన విషయాల్లో 8 కేసులలో నిందితునిగా ఉన్నప్పటికీ తన కార్యకలాపాలను మార్చుకోనప్పటికీ కుంటయ్యపై వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ తెరిచినట్లు తెలిపారు. అయినప్పటికీ అతను నేర కార్యకలాపాలను కొనసాగిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తుండటంతో కుంటయ్యపై పీడీ యాక్ట్ అమలు చేశారని, ఇట్టి ఉత్తర్వులను అందజేసి చర్లపల్లి జైలుకు తరలించామని ఆయన తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 7: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన బోడ సాయికుమార్ పురుగుల మందు తాగి బుధవారం ఆత్మహత్యకు యత్నించాడని స్థానికులు తెలిపారు. గ్రామంలోని సాయికుమార్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని పేర్కొన్నారు. బుధవారం ఉదయం తన స్నేహితులతో కలిసి విందు చేసుకున్నారని చెప్పారు. అనంతరం తాను పురుగుల మందు తాగుతున్నానని పేర్కొంటూ సెల్‌ఫోన్‌లో సెల్ఫీ వీడియో తీసి మిత్రులకు వాట్సప్‌లో పోస్టు చేశాడని పేర్కొన్నారు. గ్రామ శివారులోకి చేరుకున్న స్నేహితులు సాయికుమార్‌ను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారని తెలిపారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు నిర్ధారించారని పేర్కొన్నారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియడం లేదని చెప్పారు. ఈ విషయంపై ఎస్ఐ రమాకాంత్‌ను వివరణగా తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదన్నారు.

బాలిక కిడ్నాప్ కేసులో ఏడేళ్ల జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 7: బాలికను కిడ్నాప్ చేసి అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో వేములవాడ పట్టణానికి చెందిన ఎర్రం సాయికిరణ్‌కు ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధిస్తూ ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ జడ్జి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత బుధవారం తీర్పు ఇచ్చినట్లు వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. అక్టోబరు 7,2016న ఓ బాలికను సాయికిరణ్ కిడ్నాప్ చేసి అసభ్యంగా ప్రవర్తించడంతో ఫోక్సో కేసు నమోదైనట్లు సీఐ తెలిపారు.

బొగ్గు రంగ సంస్థలను నాశనం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

● 16న జరిగే సమ్మెను విజయవంతం చేయండి ● సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

గోదావరిఖని, ఫిబ్రవరి 7: బొగ్గు రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం నాశనం చేస్తోందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ఆరోపించారు. బుధవారం గోదావరిఖని చౌరస్తాలోని శ్రామిక భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సహజ సంపద అయిన బొగ్గు బ్లాకులను కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు అమ్మకానికి పెట్టిందని, అందులో భాగంగానే సింగరేణిలోని నాలుగు బొగ్గు బ్లాకులను ఈ వేలం ద్వారా గుత్తేదార్లకు అమ్మడం కోసం ప్రయత్నాలు సాగిస్తున్నాయని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రానికి కొంగు బంగారమైన సింగరేణిని కాపాడడం కోసం ఈనెల 16న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. దేశంలోని 160బొగ్గు బ్లాకులను అంబానీ, అదానీలకు అమ్ముతున్నారని, ప్రభుత్వరంగ ఆస్తులను కాపాడుకోకపోతే దేశంలోని పేదరికాన్ని నిర్మూలించలేమన్నారు. పదేళ్ల కాలంలో దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను ప్రధాని నరేంద్ర మోదీ అమ్మకానికి పెట్టి అందులో పని చేస్తున్న కార్మికులను రోడ్డున పడవేశారని విమర్శించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి తగిన బుద్ధి చెప్పకపోతే రానున్న రోజుల్లో దేశం సర్వనాశనం అవుతుందని, దీన్ని ప్రజలు, కార్మికులు, కర్షకులు గుర్తుంచుకొని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజిరెడ్డి, ఎర్రవెల్లి ముత్యం, ఉల్లి మొగిలి, ప్రవీణ్‌కుమార్, వెంకన్న, రాజేశం, శ్రీహరి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

సూక్ష్మ కళాకారుడికి మూడు ప్రపంచ రికార్డులు

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 7: జిల్లా కేంద్రంలోని తులసీనగర్‌కు చెందిన డాక్టర్ గుర్రం దయాకర్ అనే సూక్ష్మ కళాకారుడు తన ప్రతిభను చాటుతున్నాడు. మూడు ప్రపంచ రికార్డులు పొంది జగిత్యాల పేరును కీర్తికెక్కించాడు. అయోధ్య రామ మందిర ప్రతిష్ఠ పర్వదినాన్ని పురస్కరించుకుని అద్భుతమైన రామమందిర సూక్ష్మ కళారూపాన్ని తయారుచేసి అబ్బురపరిచాడు. 60 గంటల పాటు కష్టపడి 60 వేలకు పైగా బియ్యపు గింజలు ఉపయోగించి తయారు చేసిన విగ్రహానికి మూడు ప్రపంచ రికార్డులు దక్కాయి. భారత్ వరల్డ్ రికార్డ్స్, టాలెంట్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, యూనివర్సల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు దయాకర్ ప్రతిభను గుర్తించారు. బుధవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో మూడు ప్రపంచ రికార్డులకు సంబంధించిన సర్టిఫికెట్లను ప్రముఖ సినీ నటుడు బాబూమోహన్ చేతుల మీదుగా అందజేశారు.


ధ్రువీకరణ పత్రాలు అందుకుంటున్న దయాకర్

15న జేఎల్ఎం సర్టిఫికెట్ల వెరిఫికేషన్

గణేశ్‌నగర్,ఫిబ్రవరి 7 : ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో ఈ నెల 15న గురువారం జేఎల్ఎం 5వ విడత జాబితా నియామకం కొరకు అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్, పోలు ఎక్కించే పరీక్షలు నిర్వహించనున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ తెలిపారు. ఈ పరీక్షలు నియామక కమిటీ ద్వారా నిర్వహించనున్నట్లు తెలిపారు. వీరి జాబితాను వారి చిరునామాకు రిజిస్టర్ పోస్టు ద్వారా పంపనున్నట్లు తెలిపారు. ఎవరికైనా లెటర్ ముట్టకపోతే ఎస్ఈ కార్యాలయంలో వారి ఐడీ కార్డు చూపించి కాల్ లెటర్లు పొందవచ్చని తెలిపారు.

ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 7: ఉమ్మడి జిల్లా సీనియర్స్ పురుషులు, మహిళల హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలను ఈ నెల 10న నిర్వహించనున్నారు. కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఉదయం 10 నుంచి ఈ పోటీలను నిర్వహించనున్నామని జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బాసరవేని లక్ష్మణ్ తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 10 గంటలకు హ్యాండ్‌బాల్ సంఘం సంయుక్త కార్యదర్శి ఎన్.ప్రభాకర్, కోచ్ మూల వెంకటేష్‌లకు మైదానంలో రిపోర్టు చేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94419 25807 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఓపెన్ స్కూల్ పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈ నెల 21 వరకు అవకాశం

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 7: ఉమ్మడి జిల్లాలో ఓపెన్ స్కూల్ ప్రవేశాలు పొందిన విద్యార్థులు పది, ఇంటర్మీడియట్ పరీక్షలు రాసేందుకు ఈ నెల 12 నుంచి 21లోగా పరీక్ష ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రావు, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ నాగేశ్వర్‌రావు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. పదో తరగతి విద్యార్థులు ప్రతి సబ్జెక్టుకు 100, ఇంటర్మీడియట్ విద్యార్థులు రూ.150, ప్రాక్టికల్స్‌కు రూ.150 చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. ఒక్కో సబ్జెక్టుకు 25 రూపాయల అపరాధ రుసుముతో ఈ నెల 27వ తేదీ వరకు, రూ.50 తో మార్చి 4వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చన్నారు.

పోలీసు కస్టడీకి భూకబ్జా నిందితులు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 7: నకిలీ డాక్యుమెంట్లు తయారు చేసి అక్రమంగా భూకబ్జాలకు పాల్పడిన కేసులో వారం రోజుల నుంచి కరీంనగర్ జిల్లా జైలులో ఉన్న తీగల గుట్టపల్లి మాజీ ఎంపీటీసీ కొమ్ము భూమయ్య, గుంజ లక్ష్మణ్‌లను బుధవారం కరీంనగర్ రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నకిలీ ధ్రువపత్రాలు, నకిలీ స్టాంపులతో ఆరెపల్లి సర్పంచ్, పంచాయతీ కార్యదర్శుల సంతకాలను ఫోర్జరీ చేసిన కేసులో కొమ్ము భూమయ్య, గుంజ లక్ష్మయ్యను ఈ నెల 1న పోలీసులు అరెస్టు చేసి జైలు తరలించారు. జైలులో రిమాండ్‌లో ఉన్న ఇద్దరిని మరింత లోతుగా విచారించేందుకు రెండు రోజుల కిందట పోలీసులు కరీంనగర్ కోర్టులో కస్టడీ పిటిషన్ వేయగా ఒక రోజు కస్టడీకి అనుమతి లభించింది. ఈ మేరకు భూమయ్య, గుంజ లక్ష్మన్‌లను ఉదయం 10 గంటలకు కస్టడీకి తీసుకుని మొదట విచారణ అనంతరం తీగలగుట్టపల్లిలోని ఇద్దరి ఇళ్లలో సోదాలు జరిపారు. ఈ సోదాల్లో అక్రమ భూకబ్జాలకు సంబంధించిన పలు కీలక డాక్యుమెంట్లు, నకిలీ స్టాంపులు, నకిలీ ధ్రువపత్రాలు లభించినట్లు తెలిసింది. ఈ డాక్యుమెంట్లను భూమయ్య ముందుంచి మరింత సమాచారాన్ని సేకరించినట్లు తెలిసింది. నకిలీ స్టాంపులు, ధ్రువపత్రాల తయారీకి సహకరించిన వారి వివరాలతోపాటు ఎవరెవరి భూములు కబ్జాచేసింది, కబ్జాకు ప్రయత్నించిన వివరాలను రాబట్టినట్లు సమాచారం. భూమయ్య తీగలగుట్టపల్లి ప్రాంతంలో కూడా పలువురి ఇళ్ల స్థలాలను కబ్జా చేశాడని ఆరోపణలు వచ్చాయి.

● భూకబ్జా, బెదిరింపులు, దౌర్జన్యానికి సంబంధించిన ఐదు కేసుల్లో జనవరి 24న అరెస్టు అయి కరీంనగర్ జిల్లా జైలులో ఉన్న సీతారాంపూర్ కార్పొరేటర్ జంగిలి సాగర్‌ను పోలీసులు బుధవారం రెండోసారి కస్టడీకి తీసుకుని విచారిస్తున్నారు. అరెస్టు అయిన సాగర్‌పై ఇప్పటికే రౌడీషీట్ తెరిచారు. ఫిబ్రవరి 1న మొదటిసారి కస్టడీ తీసుకుని విచారించారు.

కబ్జా స్థలాలు బాధితులకు అప్పగింతపై విచారణ

కిసాన్‌నగర్‌లో ఒక నాయకుడు తన వద్దకు భూ వివాదం పరిష్కరించాలని వచ్చిన పలువురి స్థలాలను కబ్జా చేశాడని 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో వచ్చిన కథనంపై కరీంనగర్ స్పెషల్ బ్రాంచి పోలీసులు రంగంలోకి దిగి విచారణ జరుపుతున్నారు. ఆ నాయకుడు ఎవరు? బాధితులు ఎవరనేది విచారణ జరుపుతున్నారు. పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదులు వెళ్లకుండా భూములు కబ్జా చేసిన వ్యక్తి బాధితులతో మాట్లాడుతున్నట్లు తెలుస్తోంది. 8 మంది బాధితుల్లో నలుగురు పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

కార్పొరేషన్ ఆదాయం పెంపుపై దృష్టి పెట్టండి

- ట్రేడ్‌లైసెన్స్‌లు, ఆస్తి పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం వద్దు

- సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ అరుణశ్రీ

కోల్‌సిటీ, ఫిబ్రవరి 7: రామగుండం నగరపాలక సంస్థ ఆదాయం పెంపుపై దృష్టి పెట్టాలని అదనపు కలెక్టర్ అరుణశ్రీ ఆదేశించారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో రెవెన్యూ, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నగరపాలక సంస్థ ఆదాయం పెంచడంపై దృష్టి పెట్టకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. రెవెన్యూ విభాగంలో ఆస్తిపన్ను, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు వసూలు చేయకపోవడంపై ఆమె మండిపడ్డారు. సంబంధిత రెవెన్యూ ఆఫీసర్, ఆర్ఐలకు చార్జి మెమోలు ఇవ్వాలంటూ కమిషనర్ నాగేశ్వర్‌ను ఆదేశించారు. అవసరమైతే బిల్ కలెక్టర్లపై చర్యలకు ఉపక్రమించాలన్నారు. ట్రేడ్ లైసెన్స్ చెల్లించని వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. టౌన్ ప్లానింగ్ విభాగం హోర్డింగ్‌ల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, అనుమతి లేని హోర్డింగ్‌లు వందల సంఖ్యలో ఉన్నా చర్యలెందుకు చేపట్టడం లేదంటూ టీపీవోను ప్రశ్నించారు. అడ్వర్టైజ్‌మెంట్ ఫీజుల బకాయిలు చెల్లించకపోతే హోర్డింగ్‌లు తొలగించాలన్నారు. అనుమతి లేని హోర్డింగ్‌లు, బకాయిలు ఉన్న హోర్డింగ్‌లు కనబడవద్దన్నారు. ఇంజనీరింగ్ విభాగంలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు అధికారులు పనులు రికార్డు చేయడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఏఈల వారీగా తనకు అభివృద్ధి పనులపై తనకు సవివరమైన నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో కమిషనర్ నాగేశ్వర్, టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, ఇంజనీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

జాతీయ పురస్కారం అందజేత

కమాన్‌పూర్, ఫిబ్రవరి 7 : మండలానికి చెందిన రైతు, కవి, రచయిత, జర్నలిస్ట్, సామాజిక కార్యకర్త సాహిత్య రంగంలో విశేష కృషి చేస్తున్న మల్లయ్య మహర్షి హైదాబ్రాద్‌లోని కుషాయిగూడలో డెమోక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జాతీయ మహాసభలో మంగళవారం జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. అవార్డును అందుకున్న మల్లయ్య మహర్షిని పలువురు అభినందించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

అంతర్గాం, ఫిబ్రవరి 7: విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు నాణ్యమైన భోజనాన్ని అందించాలని రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 20వ డివిజన్ కార్పొరేటర్ కన్నూరి సతీష్‌కుమార్ అన్నారు. బుధవారం కార్పొరేటర్ తన డివిజన్ పరిధిలోని మల్యాలపల్లిలో గల జెడ్‌పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు భోజనంగా పెట్టే బియ్యంలో పురుగులు ఉండటాన్ని గమనించిన కార్పొరేటర్ పాఠశాల హెచ్ఎంతో మాట్లాడి బియ్యాన్ని వాపసు పంపాలని సూచించారు. సమస్యను సంబంధిత ఎంఈవో, అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్టు కార్పొరేటర్ పేర్కొన్నారు.

కమిషనర్ చాంబర్ ఎదుట కార్పొరేటర్ బైఠాయింపు

- కాంట్రాక్టర్ పనులు చేయడం లేదని ఆందోళన



కమిషనర్ చాంబర్ ఎదుట బైఠాయించిన కార్పొరేటర్, డివిజన్‌వాసులు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 7: రామగుండం నగరపాలక సంస్థ 42వ డివిజన్‌లో టెండర్ పూర్తయి ఏడాది అయినా కాంట్రాక్టర్ అభివృద్ధి పనులు చేయడం లేదని డివిజన్ కార్పొరేటర్ బాల రాజ్‌కుమార్, ప్రజలు బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ చాంబర్ ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని మేదరిబస్తీలో సీసీ రోడ్డుకు రూ.45 లక్షలు, కళ్యాణ్‌నగర్‌లోని మేకలమార్కెట్ సీసీ రోడ్డుకు రూ.15లక్షలు టెండర్ పూర్తయి ఏడాది అయ్యిందని, కానీ కాంట్రాక్టర్ పనులు చేయడం లేదన్నారు. వ్యాపార కేంద్రమైన ఈ ప్రాంతంలో రోడ్డు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంట్రాక్టర్‌ను, అధికారులను ఎన్నిసార్లు అడిగినా స్పందించడం లేదని, అతని పనిని రద్దుచేసి టెండర్‌ను రీకాల్ చేయాలన్నారు. అదనపు కలెక్టర్ అరుణశ్రీ, కమిషనర్ నాగేశ్వర్ ఆందోళన చేస్తున్న కార్పొరేటర్, అధికారులతో మాట్లాడారు. కాంట్రాక్టర్‌ను బ్లాక్‌లిస్టులో పెట్టి మళ్లీ స్వల్పకాలిక టెండర్‌ను నిర్వహించి పనులు మొదలు పెట్టాలని అధికారులను ఆదేశించారు.

సౌకర్యాల కల్పనపై దృష్టి సారించాలి

కమాన్‌పూర్, ఫిబ్రవరి 7 : సమ్మక్క-సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు పూర్తి స్థాయిలో సౌకర్యాల కల్పన అధికారులు దృష్టి సారించాలని మంథని డీఎల్‌పీవో తేజావత్ రాంబాబు అన్నారు. బుధవారం గుండారం గ్రామంలోని సమ్మక్క-సారలమ్మ జాతర ప్రాంగణాన్ని అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు తాగునీరు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని కమిటీని కోరారు. జాతర ప్రాంగణంలో ఎటువంటి చెత్త, చెదారం లేకుండా చేసే బాధ్యత గ్రామపంచాయతీ సిబ్బందిపై ఉందన్నారు. ఆయన వెంట ఎంపీడీవో విజయ్‌కుమార్, గ్రామ ప్రత్యేక అధికారి సుధాటి కోటేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్ పిడుగు నరసయ్య, గుండారం హనుమాన్ దేవాలయం ధర్మకర్త దండే సదయ్య, గ్రామ కార్యదర్శి గర్రెపల్లి నరేష్‌గౌడ్, అసిస్టెంట్ సతీష్, కోయరాజు, జవ్వరాజు, సోమరాజు తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్



బసంత్‌నగర్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ



సుల్తాన్‌పూర్‌లో మాట్లాడుతున్న డీపీవో

పాలకుర్తి, ఫిబ్రవరి 7: పటిష్ట కార్యాచరణతో పారిశుధ్య ప్రత్యేక డ్రైవ్‌ను విజయవంతం చేయాలని, పారిశుధ్య డ్రైవ్ ద్వారా గ్రామాల్లో స్పష్టమైన మార్పు కనిపించాలని అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ అన్నారు. బుధవారం అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ పాలకుర్తి మండలం బసంత్‌నగర్ గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ సందర్భంగా నిర్వహించిన గ్రామ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు ఫిబ్రవరి 7 నుంచి ఫిబ్రవరి 15 వరకు గ్రామ పంచాయతీలలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌ను నిర్వహిస్తున్నామని అన్నారు. గ్రామ పంచాయతీలలో ప్రత్యేక అధికారులు బాధ్యత తీసుకున్న తర్వాత నిర్వహిస్తున్న మొదటి ప్రత్యేక డ్రైవ్ సందర్భంగా పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యత కల్పించాలని అన్నారు. గ్రామ పంచాయతీ విధులలో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యత కల్పించాలని, డ్రైవ్ సందర్భంగా గ్రామంలో ఉన్న తాగునీటి పైప్‌లైన్, కుళాయి లీకేజీలను అరికట్టాలని, తాగునీరు సరఫరా ఇబ్బంది ఉన్న ఇండ్లు, వార్డులను గుర్తించి గ్రామీణ నీటి సరఫరా అధికారుల సమన్వయంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని, వేసవి కాలంలో తాగు నీటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్త వహించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వ్యాళ్ల అనసూర్య, ఎంపీటీసీ పాత బాగ్యలక్ష్మి, ఎంపీవో షబ్బీర్ పాషా, సంబంధిత అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎలిగేడు, ఫిబ్రవరి 7 : గ్రామాలు బాగుంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి అన్నారు. మండలంలోని సుల్తాన్‌పూర్‌లో ఆయన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామపంచాయతీలో వివిధ శాఖల సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి పలు తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దానపర్తి స్రవంతిమోహన్‌రావు, స్పెషల్ ఆఫీసర్స్ ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, తహసీల్దార్ స్వర్ణ, డిప్యూటీ తాహసీల్దార్ కిరణ్‌కుమార్, ఉమాపతి, జగదీశ్వర్, యశశ్రీ, ఎంపీఓ అనిల్‌రెడ్డితో పాటు గ్రామకార్యదర్శులు, వీవోఏలు, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి7 : మండలంలోని గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు ఎంపీవో సుదర్శన్ అన్నారు. బుధవారం మండలంలోని గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య, పరిశుభ్రత డ్రైవ్ నిర్వహించారు. చీకురాయి, భోజన్నపేట గ్రామాల్లో ఎంపీవో సుదర్శన్ గ్రామస్థాయి అధికారులతో సమావేశాలు నిర్వహించారు. అనంతరం గ్రామాల్లో చేపట్టబోయే పారిశుధ్యం, పరిశుభ్రత పట్ల పలు అంశాలను వివరించారు. ఎంపీవో సుదర్శన్ మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా ప్రత్యేక అధికారులు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పెద్దపల్లి జడ్పీటీసీ రామ్మూర్తి, ఏపీఎం సంపత్‌తోపాటు ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

ధర్మారం, ఫిబ్రవరి7: గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక అధికారులు దృష్టి సారించాలని ఎంపీడీవో బీ. జయశీల సూచించారు. బుధవారం మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ప్రతి గ్రామంలో ఎక్కడా పారిశుధ్యం లోపించకుండా ప్రత్యేక అధికారులు చొరవ చూపాలన్నారు. ప్రతి రోజు డ్రైనేజీలను శుభ్రం చేసి రోడ్లపై చెత్తాచెదారం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. రోడ్లపై గుంతలను పూడ్చివేసేందుకు చర్యలు తీసుకున్నారు. తాగునీటి సరఫరాపై వీధుల్లో ప్రత్యేక అధికారులు పర్యటించారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయశీల, తహసీల్దార్ రజిత, ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 7: మండల కేంద్రంతో పాటు 24గ్రామ పంచాయతీలలో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో మరుగుదొడ్లు శుభ్రం చేయించడంతో పాటు వాడల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. గ్రామపరిధిలోని ఉద్యోగులతో సమావేశం నిర్వహించి పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని ప్రత్యేక అధికారులు తెలిపారు. గంగారం, లక్ష్మీపురం గ్రామాల్లో ప్రత్యేక అధికారి జాహెద్‌పాషా గ్రామస్థులతో కలిసి వాడవాడలా తిరిగి డ్రైనేజీలు శుభ్రం చేయించడంతో పాటు చుట్టూ బ్లీచింగ్ చేయించారు. మీ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవని ప్రత్యేక అధికారి గ్రామస్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారులు రాంమోహనచారి, గోవర్ధన్, రాజన్న, నాగార్జున, సురేష్ పాల్గొన్నారు.

రామగిరి, ఫిబ్రవరి 7: మండలంలో కల్వచర్ల, రత్నాపూర్ గ్రామాల్లో బుధవారం స్పెషల్ పారిశుధ్య స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ ఆరెల్లి దేవక్క ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం కార్యాలయం సమీపంతోపాటు వీధుల్లో పారిశుధ్య పనులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమేశ్, ఎంపీవో భాస్కర్, ఎంపీటీసీ చిందం మహేష్, కొట్టే సందిప్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



చీకురాయిలో పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు



కొత్తూర్‌లో మాట్లాడుతున్న ఎంపీడీవో జయశీల

పొత్కపల్లి సహకార సంఘం చైర్మన్‌పై అవిశ్వాసం



అవిశ్వాస తీర్మానం కాపీని అందజేస్తున్న డైరెక్టర్లు

పెద్దపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఓదెల మండలం పొత్కపల్లి సహకార సంఘం చైర్మన్ ఆల్ల శ్రీనివాస్‌పై డైరెక్టర్లు అవిశ్వాసం ప్రకటించారు. ఈమేరకు పది మంది డైరెక్టర్లు ఆల్ల సుమన్‌రెడ్డి, కట్కూరి కవిత, కాంతాల సమ్మిరెడ్డి, బొంగోని శ్రీనివాస్‌గౌడ్, కోట విజయ, కొట్టె దేవేందర్, తాళ్లపల్లి సదయ్య, చింతం కుమారస్వామి, గుగులోత్ పర్షనాయక్, మూల ప్రేమ్‌సాగర్‌రెడ్డి సంతకాలతో కూడిన అవిశ్వాస తీర్మానం కాపీని బుధవారం సహకార సంఘాల డిప్యూటీ రిజిస్ట్రార్ బి రాంమోహన్‌కు అందజేశారు.

భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 7: గోదావరి వంతెన వద్ద ఈనెల 21 నుంచి 24వరకు జరుగనున్న సమ్మక్క-సారలమ్మ జాతరకు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ప్రత్యేక చొరవ తీసుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతున్నారని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేష్, మహంకాళి స్వామి చెప్పారు. బుధవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారని, ఇప్పటికే మూడుసార్లు సింగరేణి, మున్సిపల్, జెన్‌కో, ఆర్‌ఎఫ్‌సీఎల్, ఎన్‌టీపీసీ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి భక్తులకు అన్నీ ఏర్పాట్లు చేయాలని సూచించారని చెప్పారు. మహిళలకు స్నానాల గదులు, బట్టలు మార్చుకునే గదులు ఏర్పాటు చేయాలని చెప్పారని, జాతర పనులు కూడా వేగవంతంగా నడుస్తున్నాయన్నారు. ఇబ్బందులు కలుగకుండా జాతరను నిర్వహించాలని పోలీస్ అధికారులకు సూచించారని, గతంలో హడావిడిగా పనులు నిర్వహించి భక్తులకు సౌకర్యాలు కల్పించలేని వారు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. జాతర ప్రాంగణంలో ఫ్లెక్సీలు పెట్టరాదని మున్సిపల్ అధికారులు ఆదేశాలు జారీ చేశారన్నారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు తిప్పారపు శ్రీనివాస్, నాయిని ఓదెలు, కళ్యాణి సింహాచలం, యాకూబ్‌తో పాటు నాయకురాళ్లు పాల్గొన్నారు.



యంత్రాల సామర్థ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి



అధికారులతో మాట్లాడుతున్న జీఎం సూర్యనారాయణరాజు

రామగిరి, ఫిబ్రవరి 7: ఓపెన్‌కాస్టు ప్రాజెక్టుల్లో పూర్తి స్థాయిలో యంత్రాల సామర్థ్యాన్ని వినియోగించుకోవాలని ఉపరితల గనుల జీఎం సూర్యనారాయణ రాజు అన్నారు. బుధవారం ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావుతో పాటు అధికారులతో జీఎం కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. దీంతోపాటుగా 2024-25 సంవత్సరంలో యంత్రాలకు కావలసిన పరికరాలు, విడిభాగాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉత్పత్తి లక్ష్యాలను చేరుకునేందుకు ముందస్తు చర్యలు, ప్రణాళికలు ఏర్పరచుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అధికారులు ఏలీషా, రాధాకృష్ణ, రఘుపతి, చంద్రశేఖర్, శ్రీనివాస్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రక్షణపై సమీక్షా సమావేశం

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 7: కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య ఆర్జీ-2 అధికారులతో జీఎం ఆఫీస్ కాన్ఫరెన్స్‌హాల్‌లో రక్షణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రమాదాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. డీజీఎంఎస్ అధికారుల రక్షణ ప్రమాణాలు పాటించేలా దృష్టి సారించాలని సూచించారు. భూగర్భ గనుల్లో ప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన పెంచుకోవాలని గురువయ్య ఆర్జీ-2 అధికారులకు సూచించారు. సమావేశంలో ఆర్జీ-2 జీఎం సూర్యనారాయణ, పీఓ మధుసూదన్, వీకేపీ పీఓ శ్రీనివాసరెడ్డి, ఎస్వోటూ జీఎం బచ్చ రవీందర్, ఏరియాఇంజనీర్ నరసంహారావు, పీఈ రాజాజీ, అధికారులు ఎర్రన్న, రాజేంద్రప్రసాద్, మహిపాల్, మురళీకృష్ణ పాల్గొన్నారు.

ప్రొడక్షన్ డే విషయమై అధికారులు, ఏఐటీయూసీ తీరుపై

కార్మిక సంఘాల ఆగ్రహం



మేనేజర్‌తో మాట్లాడుతున్న కార్మికులు

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 7: ప్రొడక్షన్ డే విషయంలో అధికారులు, ఏఐటీయూసీ తీరును నిరసిస్తూ ఓసీపీ-3 ఫస్ట్‌షిఫ్టులో కార్మికులు సీఐటీయూ, బీఎంఎస్, ఐఎన్‌టీయూసీ నాయకులతో కలిసి నిరసనకు దిగారు. యాజమాన్యంతో ఏఐటీయూసీ కుమ్మక్కై కార్మికుల ప్రయోజనాలను పట్టించుకోలేదని నాయకుల ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రొడక్షన్ డే అని నోటీస్ బోర్డులో యాజమాన్యం నోటీస్ ఉంచాల్సింది పోయి, ఏఐటీయూసీ నాయకులు కార్మికులకు చెప్పడం ఎక్కడి పద్ధతి అని ప్రశ్నించారు. కార్మికులతో చర్చించి ప్రోత్సాహకాలు ఇస్తామనే హామీ మేరకు గతంలో లంచ్ విరామంలో నడిపినట్లు, ప్రస్తుతం అటువంటి ప్రోత్సాహకాలు లేకుండా నడపడానికి ఏఐటీయూసీ నాయకులు ఎలా ఒప్పు కుంటారని ప్రశ్నించారు. లంచ్ విరామం లేకుండా నడపడానికి అంగీకరించని కార్మికులను ట్రాన్స్‌ఫర్లు చేస్తామని,పాత చార్జిషీట్లు వెలికితీసి క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని ఏఐటీయూసీ నాయకులు బెదిరించడాన్ని ఖండిస్తున్నట్టు ఉల్లి మొగిలి, సత్యనారాయణరెడ్డి, పెండెం సత్యనారాయణలు పేర్కొన్నారు. గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలుచేయడం మరిచి ఏఐటీ యూసీ నాయకులు కార్మికులపై జులుం ప్రదర్శించడం సరికాదన్నారు.

నాణ్యమైన బొగ్గు ఉత్పత్తితోనే సంస్థ భవిష్యత్తు



మాట్లాడుతున్న జీఎం సూర్యనారాయణ

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 7:వినియోగదారులకు నాణ్యమైన బొగ్గు అందించడంపైనే సంస్థ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని ఆర్జీ-2 జీఎం సూర్యనారాయణ అన్నారు. గురువారం సీహెచ్‌పీలో జరిగిన మల్టీడిపార్ట్‌మెంటల్ సమావేశంలో జీఎం మాట్లాడారు. సీహెచ్‌పీ ఉద్యోగులు నాణ్యతా ప్రమాణాలు పాటించడం ద్వారా సంస్థకు లాభాలు వస్తాయని, నిర్ణీత సమయంలో నాణ్యమైన బొగ్గు అందించడంపై దృష్టి పెట్టాలని జీఎం సూచించారు. ఈసందర్భంగా ఉద్యోగుల నుండి పలు అంశాలపై సూచనలు, సలహాలు స్వీకరించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, మల్టీ డిపార్ట్‌మెంట్ బృందం సభ్యులు నరసింహారావు, రవీందర్, రాజేంద్ర ప్రసాద్, మురళీకృష్ణ, వెంకట రామచంద్ర, సదానందం, పిట్ సెక్రెటరీ సెగ్గెం శంకర్ పాల్గొన్నారు.

ఓసీపీ-1లో మల్టీడిపార్ట్‌మెంటల్ సమావేశం

ఓసీపీ-1 బేస్‌వర్క్‌షాప్‌లో గురువారం మల్టీడిపార్ట్‌మెంటల్ సమావేశం జరిగింది. ప్రాజెక్టు అధికారి రాధాకృష్ణ మాట్లాడారు. నిర్దేశిత వార్షిక లక్ష్యాలను అధిగమించడంతో పాటు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ అంకిత భావం, సమష్టి కృషితో విధులు నిర్వహించాలని సూచించారు. అధికారులు ఎలీషా, శ్రీనివాసులు, చంద్రశేఖర్, రవీందర్‌రెడ్డి, ఆర్ శ్రీనివాస్, ఏఐటీయూసీ ప్రతినిధి డీటీ రావు, ఐఎన్‌టీయూసీ ప్రతినిధి గడ్డం తిరుపతి పాల్గొన్నారు.

పిట్ కమిటీ పరిచయం

ఆర్జీ-2 ఏఐటీయూసీ జీఎం ఆఫీస్ పిట్ కమిటీని గురువారం సెంట్రల్ నాయకులు జీఎం సూర్యనారాయణకు పరిచయం చేశారు. కమిటీ సలహాదారుడిగా శివశంకర్, డిప్యూటీ సెక్రెటరీగా మహేందర్, అసిస్టెంట్ సెక్రెటరీగా లోకేష్ విక్రం, జాయింట్ సెక్రెటరీ సాగర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా కొంరయ్య, సమత, డెలిగేట్లుగా దివ్య, విష్ణు, లక్ష్మిలను నియమించినట్టు జీఎంకు నాయకులు తెలిపారు. ఈకార్యక్రమంలో కేంద్ర ఉపాధ్యక్షుడు ఎల్ ప్రకాష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాజారత్నం, బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, ఉపాధ్యక్షుడు అన్నారావు, నాయకులు శ్యాంసన్, సాంబశివరావులు పాల్గొన్నారు.

'బిరుదు రాజమల్లు మృతి తీరని లోటు'

సుల్తానాబాద్, ఫిబ్రవరి 7:మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు మరణం ఈ ప్రాంత ప్రజలకు తీరని లోటని మాజీ జడ్పీటీసీ ఐల రమేష్ అన్నారు. సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బుధవారం వాకర్స్ అసోసియేషన్ వారు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బిరుదు రాజమల్లు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మంద శ్రీనివాస్ గౌడ్, రాజేంద్ర ప్రసాద్, మల్లేశం, రవీందర్, శ్రీనివాస్, తిరుపతి, ఎల్లయ్య, స్వామి, అనిల్, రాజు, వెంకన్న, మహేందర్, ప్రవీణ్, పూర్ణచందర్, రమేష్ ఎలిగేటి రమేష్, ప్రభాకర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ ఉపాధ్యక్ష పదవికి వెంకటేశ్ రాజీనామా

సుల్తానాబాద్, ఫిబ్రవరి 7: బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్న తోట వెంకటేశ్ పార్టీకి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. సుల్తానాబాద్‌లో ఆయన బుధవారం మాట్లాడుతూ బహుజనవాదం ప్రజల్లోకి తీసుకెళ్లాలన్న సంకల్పంతో బీసీ బిడ్డను ఎమ్మెల్యేను చేయాలని పార్టీలో కష్టపడి పనిచేశానని కానీ తనకు సముచిత స్థానం దక్కలేదన్నారు. తిరిగి తాను బీఆర్ఎస్‌లో చేరనున్నట్టు ప్రకటించారు. బీఎస్పీ పట్టణ అధ్యక్షుడు తోట మధు కూడా బీఎస్పీని వీడినట్లు పార్టీ సభ్యత్వాలకు రాజీనామా చేసినట్లు తెలిపారు.

'గురుకుల పాఠశాలకు ఫాతిమా షేక్ పేరు పెట్టాలి'

సుల్తానాబాద్, ఫిబ్రవరి 7: భారత తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ పేరును తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాలలకు, కళాశాలలకు పెట్టాలని సుల్తానాబాద్‌కు చెందిన మహ్మద్ యూసుఫ్ అలీ అనే ముస్లిం కమ్యూనిటీ ప్రముఖులు రాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ రాశారు. ఆ లేఖను బుధవారం ఆయన విలేకరులకు అందించారు. తన లేఖను పరిగణనలోకి తీసుకుని పరిశీలించాలని యూసుఫ్ సీఎంను కోరారు.

పాఠశాలను సందర్శించిన ఎస్సీ కార్పొరేషన్ ఈడీ

ఎలిగేడు, ఫిబ్రవరి 7: ఎలిగేడు మండలం శివపల్లి గ్రామంలో ఉన్న మండల ప్రజాపరిషత్ స్కూల్‌ను ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రవికుమార్, యూత్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సురేష్ సందర్శించారు. మధ్యాహ్నం భోజనం పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం వడ్డించారు. ఈసందర్భంగా విద్యాపరమైన సలహాలు అందజేశారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం నాగభూషణం, ఎస్ఎంసి చైర్మన్, తాండ్ర అంజి తదితరులు ఉన్నారు.

క్రీడలకు అధిక ప్రాధాన్యం



విద్యార్థి విశ్వనాథ్‌ను అభినందిస్తున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

సుల్తానాబాద్, ఫిబ్రవరి 7: చదువుతో పాటు క్రీడా రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ క్రీడల్లో విద్యార్థులకు మెరుగైన శిక్షణ ఇస్తున్నామని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్‌రెడ్డి అన్నారు. తమ పాఠశాలలో చదువుతున్న పారువెల్ల వల్లి విశ్వనాథ్ జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంను పురస్కరించుకుని బుధవారం విశ్వనాథ్‌ను నరేందర్‌రెడ్డి అభినందించారు. ఇటీవల రాష్ట్ర స్థాయి పోటీలలో విశ్వనాథ్ ప్రతిభ చూపడంతో ఆయనను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారని, ఈ నెల 9 నుంచి 12 వరకు డిల్లీలో జరుగనున్న జాతీయ స్థాయి పోటీలలో విశ్వనాథ్ పాల్గొంటారని అన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

ఎలిగేడు, ఫిబ్రవరి7: ఎలిగేడు మండలంలోని రాములపల్లె గ్రామంలో మంగళవారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించి అందులో ఉన్న కాపర్ వైర్లను ఎత్తుకెళ్లారు. జనవరి నుంచి ఫిబ్రవరి 6వరకు ఐదు ట్రాన్స్‌ఫార్మర్లను రాములపల్లిలోనే ఎత్తుకుకోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఎస్సారెస్పీ డి-86 ప్రధాన కాలువ నుంచి సాగునీరు వారానికి మూడుసార్లు రావడంతో వేసిన పొలాలు ఎండిపోతున్నాయని ఆప్రాంత రైతులు వాపోతున్నారు. పోలీసులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

'మెరిట్ జాబితాపై అభ్యంతరాలుంటే తెలపాలి'

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 7: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం పరిధిలోని జాతీయ ఆరోగ్య మిషన్ కింద ఆయుష్ విభాగంలో ఖాళీగా ఉన్న ఆయుష్ వైద్యాధికారి 1, ఫార్మసిస్ట్ 6, స్వీపర్ కమ్ నర్సింగ్ ఆర్డర్లీ 2 పోస్టుల ఉద్యోగ ప్రకటనకు సంబంధించిన ప్రొవిజనల్ మెరిట్ జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఈనెల 13లోగా సమర్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.ప్రమోద్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు ప్రొవిజనల్ మెరిట్ జాబితాను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం నోటీసు బోర్డుపై, జిల్లా వెబ్‌సైట్ తెంగాణ.గోవ్.ఇన్‌లో ఈనెల 8న ఉదయం 11గంటలకు ప్రదర్శించబడుతుందన్నారు. ఈ జాబితాపై అభ్యంతరాలు ఉన్న వారు సంబంధిత పత్రాలతో ఫిబ్రవరి 13లోగా పరిష్కరించుకోవాలన్నారు. తదుపరి జాబితాలో ఎలాంటి సవరణలు చేయబడవనీ డాక్టర్ ప్రమోద్ కుమార్ తెలిపారు.

విద్యార్థుల ప్రతిభ

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 7: డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ వారి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం పలు పోటీలు నిర్వహించారు. పెగడపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన స్టెల్లా పెయిటింగ్‌లో మంగపేటకు చెందిన వైష్ణవి, కవిత్వంలో, ఉపన్యాస పోటీల్లో పెగడపల్లి పాఠశాలకు చెందిన రక్షిత, పాటల పోటీల్లో మడిపల్లికి చెందిన ఎన్ వైష్ణవి ప్రథమ స్థానం సాధించి జిల్లాకు ఎంపికైనట్టు ఎంఈవో రాజన్న తెలిపారు. జిల్లాకు చెందిన బాలికలను ఎంఈవోతో పాటు మండల నోడల్ అధికారి మహేష్, ప్రధానోపాధ్యాయురాలు సునీత అభినందించారు.

మాజీ సర్పంచ్ దంపతులకు సన్మానం

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 7: మండలంలోని మడిపల్లి మాజీ సర్పంచ్ దంపతులు వడిగొప్పుల రాణి, మోహన్‌లతో పాటు మాజీ ఉప సర్పంచ్ పిట్టల సురేష్, వార్డు మెంబర్లను పంచాయతీ కార్యాలయంలో బుధవారం సన్మానం జరిగింది. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ రాజన్న, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్, గ్రామకార్యదర్శి సతీష్, పాఠశాల చైర్మన్ సూత్రాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సుభాష్ చంద్రబోస్‌కు ఘన నివాళి

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 7: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఛత్రపతి యవసేన ప్రతినిదులు ఘనంగా నివాళులర్పించారు. యువసేన వ్యవస్థాపక అధ్యక్షులు శివంగారి సతీష్, రాజేష్, అభినయ్, హరీష్, మహేష్, తిరుమల్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం వారి ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా శాఖ అధ్యక్షులు సునీల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రావు, కనుకయ్య, సుమిత్ర, సతీష్‌బాబు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి జడ్పీచైర్మన్ పరామర్శ

మంథని, ఫిబ్రవరి 7: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మంథని డిపోకు చెందిన బస్సు డ్రైవర్ శ్రీనివాస్‌ను జడ్పీ చైర్మన్ పుట్ట మధు బుధవారం ఆసుపత్రిలో పరామర్శించారు. ప్రమాద సంఘటన, ఆరోగ్య పరిస్థితి, చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు.

బీసీ కార్పొరేషన్ ఏర్పాటుకు వినతి

మంథని, ఫిబ్రవరి 7: బీసీ ఫెడరేషన్ కులాలతో పాటు అన్ని కులాల కార్పొరేషన్ ఏర్పాటు చేసి పాలక మండలి నియమించాలని 11 బీసీ ఫెడరేషన్ కులాల నాయకులు వినతిపత్రం సమర్పించారు. బుధవారం స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి సహాయకులు చంద్రశేఖర్‌ను కలిసి 11బీసీ కులాల ఫెడరేషన్ నాయకులు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీసీ ఫెడరేషన్ కులాల సమితి నాయకులు గుంటుపల్లి సమ్మయ్య, జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గోటికారి కిషన్‌జీ, నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు మంథని సురేష్, స్వర్ణకార సంఘం నాయకులు రామ్మూర్తి, రజక సంఘం అధ్యక్షులు పోతురాజు సమ్మయ్య, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు బోయిని నారాయణలు పాల్గొన్నారు.